సాక్షి
తిరుపతి
సోమవారం । 2 । జూన్ । 2025



ప్రైవేట్ బస్సులపై కొరడా
నిబంధనలు పాటించకుండా తిప్పుతున్న పలు ప్రైవేటు బస్సులకు అధికారులు జరిమానా విధించి కేసులు నమోదు చేశారు. - 8లో



హామీల అమలుకు పోరు
కూటమి హామీలను అమలు చేసేందుకు పోరుబాట సాగిస్తామని పరిశీలకులు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో



ఎమ్మెల్యే నిలదీత
సమస్యలు పరిష్కరించాలని ఆదివారం మాధవనగర్ వాసులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను నిలదీశారు. - 8లో

న్యూస్‌రీల్

రేషన్ పంపిణీ గడువు కుదింపు

- జూన్‌లో 1 నుంచి 15 వరకే సరుకుల పంపిణీ
- రెండు రోజులు తగ్గింపుపై కార్డుదారులు అసంతృప్తి

తిరుపతి అర్బన్ : చౌక దుకాణాల్లో రేషన్ సరుకులను కార్డుదారులకు పంపిణీ చేస్తున్న గడువును ఈనెల నుంచి రెండు రోజులు తగ్గించారు. సాధారణంగా ప్రతి నెలా 1 నుంచి 17 వరకు కార్డుదారులకు సరుకులు ఇచ్చేవారు. అయితే జూన్ నెల నుంచి 1 నుంచి 15 వరకు మాత్రమే ఇవ్వనున్నారు.ఆ మేరకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు జూన్ నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ వచ్చి సరుకులు ఇచ్చే పద్ధతికి స్వస్తి చెప్పారు. చౌకదుకాణం వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి ఉంటుంది. డీలర్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు ఇవ్వాల్సి ఉంది.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 95,080 మంది స్వామివారిని దర్శించుకోగా 39,668 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.47 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

నేర నియంత్రణకు కట్టడి



డ్రోన్ తో పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

తిరుపతి క్రైమ్ : జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను పెంచి నేర నియంత్రణ కట్టడి చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను పెంచి, మే నెలలో సాధించిన పురోగతి వివరాలను వెల్లడించారు. రాత్రిపూట రోడ్లపై తిరుగుతున్న 1,997 మంది అనుమానిత వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 13 ప్రదేశాల్లో కార్డన్ సర్చ్ కార్యక్రమం నిర్వహించి 525 వాహనాలను తనిఖీ చేయగా అందులో ఎలాంటి రికార్డులు లేని 105 వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు. అలాగే డ్రోన్‌తో ట్రాఫిక్‌ను పరిశీలించి చర్యలు తీసుకున్నారు.

గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నలుగురి స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. వీరు ఆయా పాఠశాలల్లో ఆదివారం ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, యూటీఎఫ్, ఎస్టీయూ, ఎంటీఎఫ్ నాయకులు వీరిని సత్కరించి అభినందించారు.

వీధిన పడ్డాం బాబు!

కూటమి ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన రేషన్ బండి సేవలు రద్దు చేయడంతో ప్రజలకు కష్టాలు రెట్టింపయ్యాయి. ఆదివారం చౌక దుకాణాల వద్ద ప్రారంభమైన రేషన్ పంపిణీలో లబ్ధిదారులకు కన్నీరు పెట్టించాయి. మండు టెండలో గంటల తరబడి వృద్ధులు, మహిళలు నిలబడ లేక అగచాట్లు పడ్డారు. దీనికితోడు సర్వర్లు మొరాయించడంతో నిరీక్షించలేక అవస్థలు పడ్డారు. కొన్నిచోట్ల ఆర్భాటంగా రేషన్ దుకాణాలు ప్రారంభించి అందరికీ పంపిణీ చేయకుండా చేతులెత్తేయడంతో కార్డుదారులు ఉసూరుమని వెనుదిరగక తప్పలేదు. మరికొన్నిచోట్ల 10 కి.మీ. దూరం నడిచి రేషన్ తీసుకెళ్లలేమని గ్రామస్తులందరూ ఏకంగా నిరసనకు దిగారు. జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు రేషన్ పంపిణీలో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



జీవకోనలోని పార్వతీ నగర్ రేషన్ దుకాణం వద్ద క్యూ లైన్ లో బారులు తీరిన లబ్ధిదారులు



బుచ్చినాయుడుకండ్రిగలో చంకలో బిడ్డతో బియ్యాన్ని తీసుకుపోతున్న మహిళ



బియ్యం మూటలను మోసుకెళుతున్న లబ్ధిదారులు

రేషన్ కోసం ఎండలో పడిగాపులు

- కూటమి నేతల ప్రచార ఆర్భాటం
- పాత షాపులనే తిరిగి ప్రారంభించిన కూటమి నేతలు
- ప్రారంభించాక రేషన్ వెయ్యకనే వెనక్కి పంపేసిన డీలర్లు
- పలుచోట్ల పనిచేయని సర్వర్లు.. తప్పని నిరీక్షణలు
- వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్లను పిలవొద్దని ఆదేశాలు



క్యూలో నిలబడలేక నేలపై కూర్చొని నిరీక్షిస్తున్న వృద్ధులు



రాజీవ్ గాంధీ కాలనీలోని ఓ రేషన్ దుకాణం వద్ద క్యూలో పడిగాపులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : కూటమి పాలనలో సేవలు ఒక్కొక్కటిగా రద్దవుతుండటంతో జనం వీధిన పడ్డారు. నాడు ఇంటింటికీ వచ్చి సేవలందించే వలంటీర్ల వ్యవస్థకు నేడు మంగళం పాడారు. గ్రామ సచివాలయాల్లో అందుతున్న సేవలు నేడు అందకపోవడంతో జనం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లక తప్పడం లేదు. తాజాగా ఇంటింటికీ రేషన్‌ను చేరవేసే వాహనాలను రద్దు చేసి లబ్ధిదారులు దుకాణాల వద్దకు వెళ్లి బియ్యం, చక్కెర ఇతర సరుకులు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయంతో ఆదివారం రేషన్ కోసం జనం వీధుల బాట పట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టింది. డీలర్లు వాహనాల్లో రేషన్ తీసుకుని లబ్ధిదారుని నివాసానికి వెళ్లి సరుకులు పంపిణీ చేసేవారు. కూటమి పాలన వచ్చిన వెంటనే రేషన్ డోర్ డెలివరీకి మంగళం పాడేసింది. దీంతో ఆదివారం చౌక దుకాణాల వద్ద రేషన్ కోసం పలువురు వృద్ధులు మహిళలు మండు టెండలో నిరీక్షించి అష్టకష్టాలు పడి హమ్మయ్య ఈ రోజుకు తీసుకున్నామని కొంత మంది ఊపిరిపీల్చుకోగా మరికొంత మందికి బియ్యం అందక నిట్టూరుస్తూ ఇంటి బాట పట్టారు.

గంటల తరబడి ఎండలో నిరీక్షణ

రేషన్ డోర్ డెలివరీ ప్రక్రియను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో చేసేది లేక లబ్ధిదారులు ఆదివారం ఉదయమే దుకాణాల వద్దకు పరుగులు తీశారు. అయితే కూటమి ఎమ్మెల్యే, స్థానిక నాయకులు వచ్చే వరకు రేషన్ వేయమని చెప్పడంతో లబ్ధిదారులు ఎండలో క్యూలైన్లో బారులు తీరక తప్పలేదు. కొన్ని చోట్ల కూటమి నేతలు వచ్చి ప్రారంభించి వెళ్లిపోయాక డీలర్లు ఇద్దరు, ముగ్గురికి సరుకులు పంపిణీ చేసి సోమవారం రండి అని వెనక్కు పంపించి వేశారు. తిరుపతి నగరంలోనే కాకుండా అనేక చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. మరోవైపు అనేక ప్రాంతాల్లో సర్వర్లు మొరాయించడంతో గంటల తరబడి ఎండలో వేచి ఉండక తప్పలేదు. రెండు, మూడు కిలోమీటర్ల నుంచి లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు తరలిరావడం కనిపించింది. గంటల తరబడి వేచి ఉండి రేషన్ తీసుకుని నెత్తిన పెట్టుకొని ఎండలోనే సొంత ఊర్లకు తిరిగి వెళ్లడం కనిపించింది. మరికొన్ని చోట్ల రేషన్ దుకాణాలు తెరుచుకోకపోవడంతో లబ్ధిదారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇంకొన్ని చోట్ల దుకాణాలు ఆలస్యంగా తెరుచుకోవడంతో అప్పటి వరకు కార్డుదారులు పడిగాపులు పడ్డారు.

కంది పప్పు, చక్కెర సగం మందికే..

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రేషన్ దుకాణాల్లో బియ్యం తప్ప మిగిలిన సరుకులు అరకొరగానే సరఫరా చేస్తున్నారు. ఆదివారం ఆర్భాటంగా ప్రారంభించిన రేషన్ దుకాణాల్లోనూ కందిపప్పు, చక్కెర అరకొరగానే ఇచ్చారు. తిరుపతి జిల్లాలో మొత్తం 1457 చౌక దుకాణాలు ఉన్నాయి. ఈ చౌక దుకాణాల పరిధిలో 6.03 లక్షల రేషన్ కార్డు దారుల కోసం ప్రతి నెలా 8,350 మెట్రిక్ టన్నుల బియ్యం, 600 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 1200 మెట్రిక్ టన్నుల చక్కెర దిగుమతి చేయాల్సి ఉంది. అయితే ఈ నెల కోటా కింద బియ్యం మాత్రమే పూర్తి స్థాయిలో దిగుమతి అయ్యాయని అధికారులు చెబుతున్నారు. కందిపప్పు, చక్కెర మాత్రం సగం మాత్రమే దిగుమతి అయ్యాయని వెల్లడించారు. ఫలితంగా కార్డు దారులందరికీ పూర్తి స్థాయిలో కందిపప్పు, చక్కెర ఇచ్చే పరిస్థితి లేదని సంబంధిత అధికారులు చెప్పడం గమనార్హం.

10 కి.మీ.నడిచి వెళ్లి సరుకులు ఎలా తెచ్చుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కోతలగుంట గ్రామస్తులు

చిట్టమూరు : ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా రేషన్ సరుకులు తమ గ్రామానికి వచ్చే ఎండీయూ వాహనాలను నిలిపి వేస్తే 10 కిలో మీటర్లు నడిచి వెళ్లి ఎలా సరుకులు తెచ్చుకోవాలని కోతలగుంట గ్రామస్తులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామం ఈశ్వరవాక గ్రామానికి సుమారు 10 కిలో మీటర్లు ఉంటుందన్నారు. గ్రామంలో 120 కుటుంబాల వారు నివాసం ఉన్నారన్నారు. ఇంత దూరం పంట పొలాల్లో నడిచి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉందన్నారు.

కూలి పనులు పాయే..

రేషన్ కోసం పేదవాడి తిప్పలు అన్నీ ఇన్నీ కావు. కూటమి పాలన వచ్చాక రేషన్ ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకటో తేదీ ప్రారంభిస్తారు కనుక.. కచ్చితంగా రేషన్ తీసుకోవచ్చని భావించి అనేక మంది కూలీలు పనులు మానేసి దుకాణాలకు చేరుకున్నామని పలువురు చర్చించుకోవడం గమనార్హం. కొన్నిచోట్ల రేషన్ ప్రారంభించి తరువాత ఇవ్వకపోవడంతో కూటమి పాలకులను తిట్టుకుంటూ వెనుదిరిగి పోవడం కనిపించింది.



పాత దుకాణాలకు ముస్తాబు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఆదివారం రేషన్ దుకాణాల ప్రారంభోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. పాత రేషన్ దుకాణాలకు మామిడి తోరణాలు, పూలు అలంకరించి స్థానిక ఎమ్మెల్యే, కూటమి నేతల ద్వారా ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లను ఆహ్వానించవద్దని అధికారులను ఆదేశించారు. దీంతో కూటమి ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులే ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఆలస్యమైనా కూటమి నేతలు వచ్చే వరకు రేషన్ వేయడానికి వీల్లేదని అనేక చోట్ల డీలర్లకు హుకుం జారీ చేసినట్లు సమాచారం.



పాత రేషన్ దుకాణాన్ని ప్రారంభానికి ముస్తాబు చేసిన డీలర్

బండ్లు తీసేసి ఇవేం పనులయ్యా



ఉన్న బండ్లు తీసేసి ఇవేం పనులయ్యా. రేషన్ షాపు సరుకులు నేరుగా ఇంటికి వచ్చి ఇస్తావున్నారు కదా, వాటిని రద్దు చేసి ఏమి సాధిస్తారు. ఇప్పుడు గోతాం తీసుకుని ఎదురు చూసి తీసుకునే పరిస్థితి. ఇక నుంచి రేషన్ కష్టాలు మళ్లీ పడాల్సిందేనా.

– తుపాకుల రేణుక, కోటపోలూరు, సూళ్లూరుపేట మండలం

ప్రశ్నిస్తే దబాయిస్తున్నారు!



నరసింగాపురంలోని చౌక దుకాణాన్ని ఇష్టం వచ్చిన సమయంలో తెరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సకాలంలో రేషన్ ఇవ్వడం మానేశారు. గ్రామస్తులంతా ప్రశ్నించారు. దీంతో డీలరు మాపై దౌర్జన్యానికి దిగుతున్నారు. గతంలో ఇస్తున్న మాదిరిగానే రేషన్ అందించాలి.

– కోమల, నరసింగాపురం



రేషన్ కోసం రేపు రండి అంటూ చెబుతున్న డీలర్



రేషన్ దుకాణం వద్ద ఎండలో గోతాలను తలపై పెట్టుకుని వేచి ఉన్న లబ్ధిదారులు

రేషన్ కోసం 3 కిలోమీటర్లు వెళ్లాలి

ప్రస్తుతం రేషన్ సరుకులు తీసుకోవాలంటే మూడు కిలోమీటర్లు దూరానికి ఆటోకి రూ.20 చెల్లించి వెళ్లాలి. నిన్నటి దాకా జగన్ పుణ్యమా అని బండ్లు మా ఇంటివద్దకే వచ్చి సరుకులు ఇచ్చేవి. ఈ రోజు నుంచి ఆ బండ్లు రావంట. ఇక నుంచి షాపులకు వెళ్లి సరుకులు తీసుకోవాలంట. ఇదేం ప్రభుత్వం.. సౌకర్యంగా ఉన్న బండ్లను ఎందుకు రద్దు చేశారు. మమ్మల్ని ఎందుకు ఇబ్బందులు పెడతున్నారు.

– వీరాస్వామి, కోటపోలూరు, సూళ్లూరుపేట



4న వెన్నుపోటు దినం విజయవంతం చేద్దాం

- పార్టీ నాయకులతో భూమన సమావేశం

తిరుపతి మంగళం : అబద్ధపు హామీలతో రాష్ట్ర ప్రజలను వంచించి మోసగించిన చంద్రబాబు నీచ రాజకీయాలను ప్రజలందరికీ తెలియజేయాల్సి అవసరం ఆసన్నమయిందని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసంలో ఆదివారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. జూన్ 4వ తేదీని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెన్నుపోటు దినంగా నామకరణం చేశారని భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఇంత వరకు ఏ ఒక్కటి నెరవేర్చిన పాపానపోలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కన్నా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయించడం, జైళ్లకు పంపడమే పనిగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ పెట్టుకున్నారన్నారు. జూన్ 4వతేదీన నిర్వహించే వెన్నుపోటు దినంను రాష్ట్రానికే ఆదర్శంగా తిరుపతిలో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు.



పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

కూటమి నేతల్లో వణుకు పుట్టాలి

తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. జూన్ 4వతేది తిరుపతిలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమంతో కూటమి నాయకుల వెన్నులో వణుకు పుట్టేలా చేద్దామన్నారు. ముందుగా జీవకోన సత్యనారాయణపురం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం తిరుపతి ఆర్డీవోకి వినతిపత్రం సమర్పించి నిరసన తెలుపుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, చంద్రబాబు అబద్ధపు హామీలతో మోసపోయిన ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు తలారి రాజేంద్ర, నల్లాని బాబు, కట్టా గోపీయాదవ్, కల్లూరి చెంగయ్య, సాకం ప్రభాకర్, పార్టీ యువజన విభాగం జిల్లా, నగర అధ్యక్షులు ఉదయ్‌వంశీ, దినేష్‌రాయల్, అసెంబ్లీ బూత్‌కమిటీ ఇంచార్జ్ ముప్పాల సాయికుమారి, నాయకులు షేక్ ఇమ్రాన్‌బాషా, అమరనాథ్‌రెడ్డి, డిష్ చంద్ర, మద్దాలి శేఖర్, రాపూరి ప్రసాద్, అనీల్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, రమణారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం



రాజశేఖర్‌రెడ్డి, డీఐఈఓ, తిరుపతి జిల్లా

తిరుపతి ఎడ్యుకేషన్ : నేటి నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం అవుతాయని ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి (డీఐఈఓ) రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలోని డీఐఈఓ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ద్వారానే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జిల్లాలోని 21 ప్రభుత్వ, 1 ఎయిడెడ్, మొత్తం 22 ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా అన్ని వసతులు ఉన్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఇంగ్లీష్, తెలుగు మీడియాల్లో విద్యా బోధన అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎంబైపీసీ గ్రూపులు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించి సహకరించాలని డీఐఈఓ కోరారు.

ముగిసిన కానిస్టేబుల్ పరీక్షలు

- 5049 మంది హాజరు.. 165 మంది గైర్హాజరు

తిరుపతి క్రైమ్ : నగరంలో నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఆదివారం స్వయంగా ఆయనే పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తూ.. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి అభ్యర్థిని పూర్తిస్థాయిలో తనిఖీ చేసి క్యూలైన్ పద్ధతిలో పరీక్ష కేంద్రానికి అనుమతించారు. పరీక్ష కేంద్రం వద్ద మెటల్ డిటెక్టర్ పద్ధతిలో తనిఖీలు నిర్వహించారు. వారి వద్ద ఉన్న హాల్ టికెట్లు పూర్తిస్థాయిలో పరిశీలించి అనుమతించారు. కానిస్టేబుల్ రాత పరీక్షకు వచ్చిన అభ్యర్థుల ఫింగర్ ప్రింట్స్ తీసుకుంటున్న తీరు ఎస్పీ పరిశీలించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, పద్మావతి డిగ్రీ ఉమెన్స్ కాలేజ్, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఇందులో మొత్తం 5214 మందికి గాను 5049 మంది హాజరయ్యారు. 165 మంది గైర్హాజరయ్యారు.



పరీక్ష కేంద్రానికి హాజరవుతున్న అభ్యర్థులు



కేంద్రాల వద్ద తనిఖీ నిర్వహిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

క్లుప్తంగా

4 నుంచి ఐటీఐ ప్రవేశానికి ఇంటర్వ్యూలు

తిరుపతి ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు మెరిట్ ఆధారంగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఆ మేరకు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ వి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ 1 నుంచి 150 వరకు, 5వ తేదీన 151 నుంచి 300 వరకు, 6వ తేదీన 301నుంచి 482 వరకు అభ్యర్థులకు ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఇది వరకే అభ్యర్థులకు ఎస్ఎంఎస్ ద్వారా ఇంటర్వ్యూ తేదీలను తెలియజేశామని, అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు హాజరవ్వాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94928 61369, 85000 21856, 82970 06849నంబర్లలో సంప్రదించాలని కన్వీనర్ తెలిపారు.


ఆన్‌లైన్‌లో అర్జీల నమోదుకు అవకాశం

– నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్ : తమ సమస్యలకు సంబంధించి అర్జీదారులు ఆన్‌లైన్ ద్వారా తమ అర్జీని నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా అర్జీలు స్వీకరించాలని ఆయన ఆదేశించారు. అయితే అర్జీదారుల కోసం డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత అర్జీకి చెందిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేస్తే వివరాలు తెలియజేస్తారని ఆయన వెల్లడించారు. ఆన్‌లైన్ అర్జీలను స్వీకరించిన తర్వాత ఇదే బాగుందంటూ.. ప్రత్యక్ష గ్రీవెన్స్‌కు మంగళం పాడే ప్రమాదం పొంచి ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

సెటిల్‌మెంట్ గణపతీ.. ఆ వాటాల మాటేమిటి?

- వామ్మో.. మఠం భూములకు ఒప్పంద పత్రాలా?
- సరికొత్త భూ దోపిడీకి బరితెగించిన అధికార పార్టీ నేత అనుచరులు
- పది నెలల్లో కోట్ల విలువైన మఠం భూములు మాయం


ద్వారాన్నూ నాకు లభ్యపడిన స్థిరాస్తి పై గల తగాదాలను నీవు క్లియర్ చేసి యిచ్చిన వెంటనే, సదరు భూమిలో నాకు 50శాతము మరియు మీకు 50 శాతము తీసుకొనగలవారము. అట్లు చేయించి యివ్వని ఎడల నీవు తీసుకొను యావత్తు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు నేను బాధ్యుడను. ఇట్లని నా సమ్మతించి వ్రాయించి ఇచ్చిన ఒప్పుదల పత్రము.

-:షెడ్యూలు:-

1వ అయిటం:

తిరుపతి డిస్ట్రిక్ట్, తిరుపతి రి.డి., తిరుపతి రూరల్ సబ్ డి., తిరుపతి రూరల్ మండలం, నెం. 49 రు అవిలాల గ్రామ లెక్కదాఖలాలో గాంధీపురంలో సర్వేనెం.13 రులో ఎ 3.00 సెంట్లు పైకి ఎ 0.75సెంట్లు గల భూమికి చెక్కు బంది వివరం.

వివాదాస్పద భూమిని కాజేసేందుకు గణపతి నాయుడు తన పేరిట రాయించుకున్న ఒప్పంద పత్రం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తిరుపతి, తిరుపతి రూరల్ మండలాల్లో కోట్ల విలువైన మఠం భూముల్లో భూబకాసురులు పాగా వేసి రాత్రికి రాత్రే అక్రమ కట్టడాలు నిర్మించేస్తున్నారు. అటువంటి భూముల్లో పాగా వేసేందుకు ఇరువర్గాలు పోటీ పడితే ఇరువర్గాలతో మధ్యస్థం చేసి సగం, సగం సెటిల్‌మెంట్‌కు ఒప్పందం కుదిర్చేవారు రంగంలోకి దిగారు. కొందరు పది మంది కుర్రాళ్లను వెనకేసుకుని వివాదాస్పద భూములనే టార్గెట్‌గా పెట్టుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో చివరకు మఠం భూములు పంచుకునేందుకు ఒప్పంద పత్రాలు కూడా రాసుకున్నారు. ఇంతకాలం గణపతి నాయుడుగా అందరికీ పరిచయమున్న ఓ నేత గత పది నెలల్లో సెటిల్‌మెంట్ గణపతిగా మారారు. ఆయనకు అధికార పార్టీకి చెందిన కీలక నాయకుడి అండ పుష్కలంగా లభిస్తుండడంతో మూడు సెటిల్‌మెంట్లు.. ఆరు కబ్జాలతో నిత్యం భూ దందాలను సజావుగా సాగిస్తున్నారు.

ఒప్పంద పత్రంలో ఏముందంటే!

అవిలాల గ్రామ లెక్క దాఖలా సర్వే నంబరు 13లోని భూమి ప్రస్తుతం తగాదాలో ఉంది. ఆ తగాదాలు తీరిస్తే సగం–సగం వాటా కింద సగభాగం భూమిని గణపతికి ఇవ్వాల్సి ఉంటుంది.. అని ఒప్పంద పత్రం రాసుకున్నారు. ఆ సర్వే నంబరులోని భూమి విలువ అంకెణం రూ.2 లక్షల వరకు ఉంది. అంటే ఇప్పుడు 4 ఎకరాల మఠం భూమి విలువ సుమారు రూ.100 కోట్లు ధర పలుకుతోంది. వివాదాలు తీర్చి మఠం నుంచి అభ్యంతరాలు లేకుండా సెటిల్ చేసినందుకు గణపతితో పాటు అతని వెనుక నిలబడి అన్నీ నడిపించే అధికార పార్టీ నాయకుడికి కూడా వాటా చేరుతుందని తెలిసింది. ఈ భూ మాఫియాకు తిరుపతి రూరల్ మండలం రెవెన్యూ యంత్రాగం దగ్గర ఉండి మరీ వాళ్లకు చదును చేసి ఇచ్చినట్టు సమాచారం. రెవెన్యూ అధికారులు తమకు సంబంధం లేని భూమిలో సాయం చేయడానికి కారణం ఆ మఠం భూముల్లో అధికార పార్టీ కీలక నాయకుడికి వాటా చేరుతుండడమేనని తెలుస్తోంది.



మఠం భూమికి ఒప్పంద పత్రం

అవిలాల గ్రామ లెక్క దాఖలా సర్వే నంబరు 13 పూర్తిగా మఠం భూమి. ఆ భూమిపై ఎవరికీ ఎలాంటి హక్కు ఉండదు. ఆ సర్వే నంబరులో 4 ఎకరాలు మఠం భూమిని కొట్టేసేందుకు పక్కాగా స్కెచ్ వేశారు సెటిల్‌మెంట్ గణపతి. ఏ ఆధారం లేకుండా, ఎటువంటి హక్కూ లేని భూమిని కొట్టేసేందుకు ఏకంగా ఒక ఒప్పంద పత్రం రాసుకున్నారు.

బాబు గారు.. ఈ అన్యాయం కనబడలేదా?

దేవునికి భక్తులు ఇచ్చిన భూములను దోచేస్తున్న విషయం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కనపడదు.. బాధితుల ఆర్తనాదాలు వినపడవు.. ఎందుకంటే ఆక్రమిత భూముల్లో ఓ మంత్రికి, అధికార పార్టీ నాయకుడికి వాటా ఉందని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా చెబుతున్నారు. మఠం భూములు కొట్టేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు ఏం చర్యలు తీసుకున్నారు..? స్థానికులకు ఏం సమాధానం చెబుతారు..? అని తిరుపతి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకపోతే మఠం అధికారులు ఆ భూమిలో ఆక్రమణలు తొలగించడానికి ససేమిర అంటున్నారు. అక్కడకు వెళితే మారణాయుధాలతో తమపై భౌతిక దాడులు చేస్తుండడమే అందుకు కారణంగా చూపుతున్నారు. మఠం భూముల పరిరక్షణకు సహకరించాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులే సెటిల్‌మెంట్ గణపతి వంటి భూ ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతుంటే తాము ఎలా వెళతామని మఠం అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. భూ మాఫియాకు అధికార పార్టీ నాయకుడు అండగా నిలబడడంతో అధికారులు ఎవరు మఠం భూములు కాపాడడానికి సాహసించరని తెలుసుకున్న స్థానిక ప్రజలు న్యాయ పోరాటం చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

సహకరిస్తే ఆక్రమణలు తొలగిస్తాం

“అవిలాల గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నం.13 మొత్తం మా మఠం భూమి. ఆ భూమిని కాపాడుకుందామన్నా కుదరడం లేదు. ఆక్రమణలు తొలగించేందుకు మేము వెళితే ఆక్రమణదారులు మారణాయుధాలతో దాడులకు దిగుతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సహకరిస్తే ఆక్రమణలు తొలగిస్తాం. మఠం భూములను స్వాధీనం చేసుకుంటాం. – కేశవులు, సూపరింటెండెంట్, హాథీరాంజీ మఠం

సినీనటుడు సోనూసూద్‌కు ఘన స్వాగతం


సోనూసూద్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు.

రేణిగుంట : సినీ నటుడు సోనుసూద్‌కు రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆదివారం తిరుమల శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి సోనూసూద్ హైదరాబాదు నుంచి ఇండిగో విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో అప్పటికే భారీగా చేరుకున్న ఆయన అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడిని 108లో తరలిస్తున్న సిబ్బంది

రేణిగుంట : రేణిగుంట మండలం కరకంబాడి కట్ట పుట్టాలమ్మ ఆలయం ముందు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు తారకరామానగర్‌కు చెందిన నన్నయ్యవేలు ద్విచక్ర వాహనంపై ఆదివారం మధ్యాహ్నం వస్తుండగా కడప వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో యువకుడు లారీ చక్రం కింద కాలు పడటంతో తీవ్ర గాయమైంది. హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. లారీని రేణిగుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బదిలీల్లో ఏకపక్ష నిర్ణయాలు సరికాదు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీల్లో అధికారుల ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదని వైఎస్సార్‌టీఏ ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలకు చేసిన చట్టం అధికారులకు చుట్టం అయ్యిందే తప్ప ఉపయోగం లేదని విమర్శించారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న ప్రతి పూటకో నిర్ణయం వివాదంగా ఉందన్నారు. గత మూడేళ్లుగా ఉద్యోగోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్స్ 196 మంది బదిలీకి దరఖాస్తు చేసుకుని పీఎస్‌హెచ్‌ఎంగా వెళ్లాలని, ప్రిఫరెన్షియల్ కేటగిరీ, విడో, విడాకులు తీసుకున్న మహిళలపై దుర్మార్గ నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతర తెలుగు మాధ్యమం లేకుండా చేయడం అన్యాయమన్నారు. విద్యార్థి నిష్పత్తి 1:40 కాకుండా 1:49 చేసి మిగులు టీచర్లను ప్రాథమిక బడులకు తరలించడం పద్ధతి కాదని విమర్శించారు.

వృద్ధులకు ఇంటి వద్దనే బియ్యం

- కాలువలు శుభ్రం చేయలేదని ఫిర్యాదు
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్


బియ్యం పంపిణీపై లోటుపాట్లను తెలుసుకుంటున్న కలెక్టర్

తిరుపతి రూరల్ : యోగి మల్లవరంలో ఆదివారం 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇళ్ల వద్దకే బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. కలెక్టర్ వస్తున్నారని తెలుసుకున్న కాలనీ వాసులు అక్కడకు చేరుకుని మురుగు కాలువలు శుభ్రం చేసి రెండు నెలలు గడుస్తోందని ఫిర్యాదు చేశారు. పంచాయతీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదనడంతో తిరుపతి రూరల్ ఎంపీడీఓ రామచంద్రకు ఫోన్ చేసి కాలువలు తక్షణం శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే సంబంధిత జిల్లా అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు రేషన్ షాపు డీలర్ వాసుతో మాట్లాడి డీలరు వద్దనే రేషన్ పంపిణీ బాగుందా..? బండిపైన తీసుకువెళ్లడం బాగుందా..? కార్డు దారులు ఏమంటున్నారు..? అంటూ ప్రశ్నించారు. సర్వర్ పనిచేయకపోవడం వల్ల చాలా మంది కార్డు దారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వయో వృద్ధుల ఇళ్లకు బియ్యం ఎలా తీసుకెళ్లి ఇస్తారని కలెక్టర్ ప్రశ్నించడంతో ఆటోలో తీసుకెళ్లి ఇవ్వాల్సిందేనని డీలర్ సమాధానం ఇచ్చారు. మరి రవాణా ఖర్చులు రావు కదా..? అన్న ప్రశ్నకు డీలరు నుంచి సమాధానం లేదు. దానిపై ప్రభుత్వంతో మాట్లాడి డీలర్లకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. పర్యటనలో డీఎస్‌ఓ రాజు, తహసీల్దారు రామాంజులు నాయక్, సీఎస్‌డీటీ యుగంధర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బోర్డుల ఏర్పాటు


కలెక్టరేట్ కార్యాలయంలోకి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్ : అర్జీదారులు తికమక పడకుండా కొత్తగా వివరాల బోర్డు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ విభాగంలో 32 విభాగాలున్నాయి. అందులో ఏ బ్లాక్‌లో 15, బీ బ్లాక్‌లో 17 శాఖలున్నాయి. అయితే కలెక్టరేట్ అధికారులు కార్యాలయంలోనికి అర్జీదారులు వెళ్లే మార్గం వైపు కాకుండా తిరిగి వచ్చే మార్గం వైపు శాఖల వారీ వివరాలకు చెందిన బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో సాక్షి దినపత్రికలో గత నెల 27న సారు...ఎక్కడ మీ చాంబరు అంటూ కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన కలెక్టరేట్ ఉద్యోగులు అర్జీదారులకు వీలుగా కలెక్టరేట్‌లోకి వెళ్లగానే కనిపించేలా కొత్తగా ఓ బోర్డును ఏర్పాటును చేశారు. మొత్తంగా వెళ్లే మార్గంలో ఓ బోర్డు...తిరిగి వచ్చే మార్గంలో మరో బోర్డును అర్జీదారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

హామీల అమలుకు పోరు

చిల్లకూరు : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేని అబద్దాల బాబుకు బుద్ధి చెబుదామని తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు మేడా రఘునాథరెడ్డి పిలుపు నిచ్చారు. గూడూరు పట్టణంలోని సనత్‌నగర్‌లోని ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్ నివాసంలో ఆదివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు పర్యాయాలు చంద్రబాబు ప్రజలకు అబద్దాలు చెప్పి గద్దెనెక్కారని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ మోహన్‌రెడ్డి ప్రతి సంక్షేమ పథకం నేరుగా పేదల ఇంటి ముంగిటకే అందించారని గుర్తు చేశారు. అతి పెద్ద సముద్ర తీరం ఉన్న రాష్ట్రంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లకు శ్రీకారం చుడితే వాటిని తామే చేపడుతున్నట్లు ప్రకటనలు ఇచ్చుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏడాది దాటుతున్నా అమలు చేయక ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారని దీనికి నిరసనగా ఈ నెల 4న చేపట్టే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మెట్టా రాధాక్రిష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, చేవూరు విజయమోహన్‌రెడ్డి, మగ్దూమ్, సుబాన్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


రామేశ్వర్ రెడ్డి(ఫైల్)

తిరుపతి క్రైమ్: నగరంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన రామేశ్వర్ రెడ్డి(32) భార్య మహితతో కలిసి రాఘవేంద్ర నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతను ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే మద్యానికి బానిసై ఇటీవల తరచూ భార్య ఆమె తండ్రితో గొడవ పడేవాడు. ఇదేవిధంగా శనివారం అర్ధరాత్రి కూడా గొడవ జరిగింది. దీంతో స్థానికులు అందరూ ఇరువురికి నచ్చజెప్పి పంపించేశారు. ఈ క్రమంలో మృతుడు భార్య మహిత ఇంటి లోపలికి వెళ్లి ఉరి వేసుకుంటానని భర్తను బెదిరించింది. అయితే ఇంటిలో నుంచి బయటికి వచ్చే సమయానికే భర్త తీవ్ర మనస్తాపానికి గురై బయటే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ఎమ్మెల్యే నిలదీత


మాధవ నగర్‌లోని సమస్యలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు చెబుతున్న స్థానికులు

తిరుపతి మంగళం: ఏదైన ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలప్పుడు తప్ప ఇంకెప్పుడు తమరు కనిపించరు.. ఇక మా సమస్యలు ఎవ్వరికి చెప్పుకోవాలి.. మా సమస్యలు పట్టించుకునే వారెవ్వరంటూ తిరుపతి 47వ డివిజన్‌కు చెందిన మాధవనగర్ వాసులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును నిలదీశారు. మాధవ నగర్‌లోని రేషన్‌షాపు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు స్థానిక సమస్యలపై ప్రజలు విన్నవించారు. మాధవ నగర్‌లో సీసీరోడ్లు సక్రమంగా లేవని, మురుగు కాలువలను వారానికి ఒక సారి కూడా శుభ్రం చేయరని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా తమ కాలనీల్లో ఒక్క సీసీ రోడ్డు కానీ, ఒక్క మురుగు కాలువ నిర్మించారా? అంటూ ఎమ్మెల్యేను ప్రశ్నించారు. గతంలో నిత్యావసర సరుకులు ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేవాళ్లని, తాము కూడా ఏ కష్టం లేకుండా ఇంటి వద్దే సరుకులు తీసుకునేవాళ్లమని స్థానిక ప్రజలంతా చెప్పారు. అయితే ఇప్పుడు మళ్లీ రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తీసుకోవాలంటే పనులు మానుకుని వెళ్లాల్సిన పరిస్థితి కల్పించారని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకపోగా మరిన్ని సమస్యలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యేని నిలదీశారు.దీంతో స్థానిక ప్రజల సమస్యలు చూడండంటూ అధికారులకు చెప్పి ఎమ్మెల్యే అక్కడ నుంచి వెళ్లిపోయారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

– యువకుడి దుర్మరణం


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని మేనకూరు పరిశ్రమల కేంద్రం సమీపంలో ఆదివారం కంటైనర్ లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన పగడాల చిరంజీవి(24) అనే యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు. గ్రద్దగుంట గ్రామానికి చెందిన చిరంజీవి మేనకూరు సెజ్ పరిధిలో టీవీఎస్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆదివారం డ్యూటీకి వెళ్లేందుకు బైక్‌లో బయలుదేరి పరిశ్రమకు కొద్ది దూరంలో ఉండగా కంటైనర్ లారీ వేగంగా వచ్చి చిరంజీవి వస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో చిరంజీవి అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రైవేట్ బస్సులపై కొరడా

- ట్యాక్స్, జరిమానాలు రూ.10 లక్షలు వసూలు
- 25 బస్సులపై కేసుల నమోదు

తిరుపతి మంగళం : రవాణాశాఖకు సకాలంలో చెల్లించాల్సిన త్రైమాసిక పన్నులను చెల్లించకుండా తిప్పుతున్న ప్రైవేటు బస్సులపై శని, ఆదివారం రెండు రోజుల పాటు రవాణాశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. అనధికార సరుకు రవాణా వ్యవహారాలు, బిల్లులను పరిశీలించారు. బళ్లారి నుంచి తిరుపతికి వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ ఫిట్నెస్, టాక్స్ చెల్లించని కారణంగా సీజ్ చేసి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి కొరప్రాటి మురళీమోహన్ ఆదేశాల మేరకు మోటర్ వాహనాల అధికారులు వనం వెంకట సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికా నాజ్, చంద్రశేఖర్ తిరుపతి నగర ప్రాంతాల్లో వాహన తనిఖీలను నిర్వహించారు. అలాగే సూళ్లురుపేట గూడూరు మోటార్ వాహన తనిఖీ అధికారులు బస్సులను తనిఖీ చేసినట్లు జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ తెలిపారు. నిబంధనలు పాటించకుండా తిప్పుతున్న బస్సులపై పలు రకాల కేసులు నమోదు చేయడమే కాకుండా మొత్తం మూడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సీజ్ చేసిన వాహనాల నుంచి ట్యాక్స్, జరిమానా రూపంలో రూ. 10 లక్షలు వసూలు చేసినట్లు చెప్పారు. అలాగే 25 వాహనాలపై పలు రకాల కేసులను నమోదు చేయడం జరిగిందన్నారు. సకాలంలో పన్నులు చెల్లించకుండా, ఫిట్‌నెస్ చేయించుకోకుండా బస్సులను రోడ్లపై తిప్పితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


మధు మృతదేహం

బుచ్చినాయుడుకండ్రిగ : తెలుగు గంగ కాలువలో దిగి గల్లంతైన యువకుడి మృతదేహం ఆదివారం చల్లంవారి గిరిజన కాలనీ వద్ద లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేవీబీపురం మండలంలోని సూరమాల గ్రామంలోని పంట పొలాల్లో నింద్ర మండలం అగరంపేటకు చెందిన రమేష్, రమ్య దంపతులు కాపలాదారులుగా ఉంటున్నారు. బెంగళూరులో ఉంటున్న రమ్య తమ్ముడు మధు (24) వేసవి సెలవుల నిమిత్తం పది రోజుల కిందట అక్క ఇంటికి వచ్చాడు. శనివారం సాయంత్రం సోదరి కొడుకులు లతీఫ్, మానీష్‌తో సరదాగా కలసి ముగ్గురు ద్విచక్ర వాహనంలో తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్లారు. మధు, లతీఫ్ కాలువలో దిగి కాళ్లు కడుగుతుండగా మధు అదుపు తప్పి కాలువలో పడిపోయాడు. అతన్ని కాపాడే ప్రయత్నంలో లతీఫ్ కూడా కాలువలో పడిపోగా, కాలువ బయట ఉన్న మానీష్ కేకలు వేయటంతో కోడిగుడ్లు అమ్ముకునే వ్యాపారి లతీఫ్‌ను కాపాడగా, మధు గల్లంతు అయ్యాడు. మధు కోసం బాధితులు రాత్రయ్యే వరకు గాలించి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం మండలంలోని చల్లంవారి గిరిజన కాలనీ వద్ద కాలువలో మధు మృతదేహాన్ని గిరిజనులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

చంద్రగిరి: వ్యవసాయ భూములకు విద్యుత్‌ను అందించే ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తుల చోరీ చేసిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల మేరకు.. మండల పరిధిలోని నాగాలచెరువు వద్ద వ్యవసాయం కోసం 16 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. ఆపై వాటిలోని విలువైన రాగి, ఆయిల్‌ను దోచుకెళ్లారు. ఈ మేరకు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి



విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు రూరల్: గూడూరు రెండో పట్టణం, ఎగువవీరారెడ్డిపల్లి సమీపంలో ఓ ప్రయివేటు లే అవుట్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం దారుణ హత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉత్తర భారత దేశానికి చెందిన సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి హత్యకు గురైనట్లు తెలిపారు. మృతుడు హిందీ మాట్లాడే వ్యక్తిగా తెలుస్తోందని, అతని కుడి చేతిపై అశోక్ అని హిందీలో అక్షరాలు ఉన్నాయని తెలిపారు. దీన్ని బట్టి ఇతను స్థానికుడు కాదన్నారు. ఇతను ఈ ప్రాంతంలో ఎక్కడైనా పరిశ్రమల్లో పనిచేస్తున్నాడా అనే విషయంపై ఆరా తీస్తున్నట్టు వెల్లడించారు. మృతుడి ముఖంపై పదునైన ఆయుధంతో దాడి చేశారని, దీంతో పాటుగా అతని శరీరంపై అక్కడక్కడా గాయాలున్నాయని తెలిపారు. ఇటీవల కాలంలో గూడూరు పరిసర ప్రాంతాల్లో నేరాల సంఖ్య అధికమవుతోందని తెలిపారు. ఈ హత్యకు సంబంధించి త్వరలోనే నిజాలను నిగ్గు తేల్చుతామని చెప్పారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు. వీరి వెంట ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది ఉన్నారు.